# బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



చిన్నశంకరంపేట: బీఆర్ఎస్‌లో చేరిన సగర సంఘం సభ్యులు



పాపన్నపేట: బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

చిన్నశంకరంపేట, నవంబర్ 13: మండల పరిధిలోని అంబాజిపేట గ్రామానికి చెందిన సగర సంఘం అధ్యక్షుడు ధ్యాప ప్రభాకర్‌తోపాటు సంఘం సభ్యులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపునకు సగర సంఘం సభ్యులమంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి రమేశ్‌గౌడ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్‌సింగిల్‌విండో చైర్మన్ అంజిరెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, బాగారెడ్డి, బాలకిషన్, నవీన్‌గౌడ్, దేవానందం, లక్ష్మణ్, మోహన్‌లింగం పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నేతల చేరిక**

పాపన్నపేట, నవంబర్ 13: మండల పరిధిలోని పొమ్లాతండాలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆర్కెల ఉప సర్పంచ్ అనిల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గడీల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో నరేశ్, చందు, గోపాల్, పవన్, సంజు, జీవన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు పూల్‌సింగ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రవీందర్ నాయక్, హరిలాల్ ఉన్నారు.

## కేసీఆర్‌కు హ్యాట్రిక్ పక్కా



మాట్లాడుతున్న రజకసంఘం అధ్యక్షుడు సంగు స్వామి

రామాయంపేట, నవంబర్ 13: రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని, బీఆర్ఎస్ మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని గెలుపు ఖాయమని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి, చలిమెట్టి నాగరాజు అన్నారు. సోమవారం రామాయంపేట పట్టణంలోని ఉమ్మడి మండల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మెదక్ ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచిన పద్మాదేవేందర్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చ నర్సింహులు, శ్రీనువాస్, నర్సింహులు, లచ్చపేట రామాగౌడ్, శ్రీశైలం, సత్యనారాయణ ఉన్నారు.

## నేడు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రచారం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 13: జిల్లా కేంద్రంలోని 6, 7, 8, 9 వార్డుల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మెదక్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటింటి ఎన్నికల ప్రచారానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జంబికుంటలోని సాయిబాబా ఆలయం నుంచి ప్రచారం ప్రారంభమవుతందని, ఉదయం 7.30 గంటల వరకు చేరుకోవాలన్నారు.

## ఓటును సద్వినియోగం చేసుకోవాలి

రామాయంపేట, నవంబర్ 13: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమాచార శాఖ కళాజాత ఆధ్వర్యంలో కళాకారులు పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం రామాయంపేట పట్టణంలోని గాంధీ విగ్రహం, మెదక్ చౌరస్తా, సిద్దిపేట చౌరస్తా కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పాటలు పాడుతూ ఓటర్లను చైతన్యం చేశారు. కార్యక్రమంలో బిట్ల ఎల్లం, ఆస రామారావు, శేఖర్, శివొళ్ల కృష్ణ, కారంగుల మాధవి, విజయలక్ష్మి, ఎలా సిద్దులు, జినుక దేవదాసు, తుమ్మల ఎల్లయ్య, బండారు నర్సయ్య, కమ్మరి నర్సయ్య ఉన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

# ఘనంగా కోత కాలపు పండుగ



మెదక్ చర్చిలో కోత కాలపు పండుగకు హాజరైన భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 13: ఏసయ్య నామ సంకీర్తనలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం కోత కాలపు పండుగ(సంవత్సరాంత కృతజ్ఞతార్పణల పండుగ)ను పురస్కరించుకొని భక్తులు తాము పండించిన తొలి పంటలోని దశమ భాగాన్ని ఏసయ్యకు సమర్పించుకున్నారు. ప్రత్యేక ఆరాధన దైవంతో కూడిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసయ్య నామస్మరణలతో చర్చి ప్రాంగణం మార్మోగింది. రైతులు పండించిన పంటల నుంచి పండ్లు, కూరగాయలు, పూలు తదితర వాటిని ఏసయ్యకు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కోతకాలపు పండుగకు హాజరైన మెదక్ బిషప్ రెవరెండ్ పద్మారావు భక్తులకు దైవ సందేశం వినిపించారు. తర్వాత ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య తదితరులు దైవసందేశం చేశారు. పలువురు మహిళలు పాడిన ఏసయ్య భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్, సువర్ణ భక్తులను ఆశీర్వదించారు. చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, ప్రాంక్‌జాన్సన్, రోలండ్‌పాల్, శాంసన్ సందీప్, నోబుల్‌సన్, సువన్‌డగ్లస్, జాయ్ ముర్రే పాల్గొన్నారు.

# ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి



రామాయంపేట చెక్ పోస్టును పరిశీలిస్తున్న పరిశీలకుడు

మెదక్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రతి వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేయాలని జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ అన్నారు. ఆదివారం మెదక్ నియోజకవర్గంలోని ఎస్ఎస్‌టీ రామాయంపేట నేషనల్ హైవే పోలీస్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీంల పనితీరును, పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్, జిల్లా పోలీస్ పరిశీలకుడు సంజయ్‌కుమార్, డీజీఐ తుకారాం పాల్గొన్నారు.

**ఏమరుపాటుగా ఉండొద్దు**

రామాయంపేట, నవంబర్ 13: రోడ్డుపై వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే వాహనాన్ని పంపించాలని, లేకుంటే అక్కడే నిలిపేయాలని జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్, సాధారణ వ్యవ పరిశీలకుడు సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రామాయంపేట జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు ముగిసేంత వరకు సిబ్బంది చెక్ పోస్టుల వద్ద ఉండాలన్నారు. కార్యక్రమంలో డీజీఐ తుకారాం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**నస్కల్ చెక్‌పోస్ట్ తనిఖీ**

నిజాంపేట, నవంబర్ 13: నిజాంపేటలోని నస్కల్ ఎక్స్ రోడ్డు వద్ద ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ సందర్శించారు. చెక్‌పోస్టు దాటే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

**'సీ విజిల్' వినియోగించుకోవాలి**

పాపన్నపేట, నవంబర్13: సీ విజిల్ యాప్‌ని, 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ సూచించారు. సోమవారం రాత్రి ఆయన పాపన్నపేట మండల పరిధిలోని లక్ష్మీనగర్, నార్సింగి గ్రామాల్లో పర్యటించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలు ఉన్నా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

**బొడ్మట్‌పల్లి చెక్‌పోస్టు తనిఖీ**

మెదక్ అర్బన్, నవంబర్ 13: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టులు కీలకంగా వ్యవహరిస్తాయని జిల్లా పోలీస్ పరిశీలకుడు సంజయ్‌కుమార్ తుకారాం అన్నారు. సోమవారం జిల్లాలోని బొడ్మట్‌పల్లి చెక్ పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## చిన్నారులను చిదిమేసిన టిప్పర్

- మెదక్ పట్టణంలో ఘటన
- ఇద్దరు పిల్లలు మృతి

మెదక్ అర్బన్, నవంబర్ 13: మెదక్ జిల్లా కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దీపావళి పండుగ సందర్భంగా పటాకులు కొనుగోలు చేసేందుకు ఎంతో సంతోషంగా తల్లితో కలిసి స్కూటీపై వెళ్లిన ఇద్దరు చిన్నారులను టిప్పర్ మృత్యువు రూపంలో చిదిమేసింది. సెకన్లలో తల్లి కళ్ల ముందే ఆ పిల్లలు విగతజీవులుగా మారారు. ఈ ఘటన మెదక్ పట్టణంలోని గోల్కొండ వీధిలోని ప్రధాన రాహదారి పల్స్ హాస్పటల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కాద్‌లూర్‌కు చెందిన తలారి శ్రీనివాస్ అన్నపూర్ణ దంపుతులకు పృథ్వీ తేజ్(9), ప్రణయ్ తేజ్(12) ఇద్దరు సంతానం. వీరు కొంతకాలంగా మెదక్ పట్టణంలోని జంబికుంటలో అద్దెకు ఉంటున్నారు. హోమ్‌గార్డ్‌గా విధులు నిర్వర్తించిన భర్త శ్రీనివాస్ ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తల్లి అన్నపూర్ణ మెదక్ పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో టీచర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం పండుగ కావడంతో ఇద్దరు పిల్లలను తీసుకొని పటాకులు కొనుగోలు చేసేందుకు స్కూటీపై వెళ్తున్న క్రమంలో మెదక్ పట్టణంలోని గోల్కొడ వీధి వద్ద ప్రధాన రహదారిపై టిప్పర్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో టిప్పర్ టైర్ ఇద్దరు చిన్నారుల తలలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తేరుకున్న తల్లి అయ్యో కొడుకా, అయ్యో బిడ్డా నేనెట్టా బతికేది అంటూ గుండెలవిసేలా రోదించిన హృదయ విదారక ఘటన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. తల్లి ఏడుస్తూ కోమాలోకి వెళ్లింది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మల్లన్న ఆలయంలో భక్తుల పూజలు

మెదక్‌రూరల్ నవంబర్ 13: మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్టపై కొలువు దీరిన మల్లికార్జున స్వామి ఆలయంలో దీపావళి అమావాస్యను పురస్కరించుకొని ఆలయ పూజారి ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనీశ్వరుడికి పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజరి మల్లన్న మాట్లాడుతూ నేటి నుంచి కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మల్లన్న స్వామికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు, ప్రతి సోమవారం వేకువజామున శివునికి అభిషేకం, కార్తిక దీపాలు వెలిగించి మహిళలు పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

## విజేతలకు బెల్టుల ప్రదానం



విజేతలతో నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 13: జిల్లా కేంద్రంలోని గుల్షణ్ క్లబ్‌లో సోమవారం రెంజుకి షోడోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెదక్ జిల్లాస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వంద మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బెల్టులను రెంజుకి షోడోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు నగేశ్ ప్రదానం చేశారు. ఈ పోటీల్లో కరాటే మాస్టార్లు దినాకర్ నవీన్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## జిల్లా సాధారణ పరిశీలకుడిగా పృథ్వీరాజ్

మెదక్ అర్బన్, నవంబర్ 13: రాష్ట్ర శాసనసభ ఎన్నికలు–2023 సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ జిల్లాకు వచ్చారని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా సోమవారం ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుల, సలహాలు, సూచనలకు పరిశీలకులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లా సాధారణ పరిశీలకుడిగా ఉన్న పృథ్వీరాజ్ బీపీ ఐడీఓసీ రెసిడెన్షియల్ క్వార్టర్స్‌లోని సూట్ 3లో ఉన్న కార్యాలయంలో అందుబాటులో ఉంటారని 89696 98906, 08452223010 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చన్నారు. పరిశీలకుడు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు జిల్లాలోనే ఉండి ఎన్నికల సంబంధిత అంశాలను పరిశీలిస్తారని తెలిపారు.